క్లుప్తంగా

పరిహారం చెల్లించాలి

తాండూర్: అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండు బానేష్ ఒక ప్రకటనలో కోరారు. గడిచిన మూడు రోజులుగా విస్తారంగా వడగండ్ల వర్షం కురవడంతో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, టమాట తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న పంటలను సర్వే చేసి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్నకు ఎకరానికి రూ.50వేలు, వరికి రూ.30వేలు, ఉద్యానవన పంటలకు ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిడుగుపాటుకు మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని తెలిపారు.

'రామునిచెరువు అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం'

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రామునిచెరువు పనులు చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాకర్స్ క్లబ్ సభ్యులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రామునిచెరువు పనులు నిర్ణీత సమయంలో చేయకపోతే ఆందోళనలు చేపడతామని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు ఆకుల సత్తన్న, వీర శంకర్, సుధీర్, పాషా, సత్యనారాయణమూర్తి, మోహన్‌రెడ్డి, చంద్రయ్య, సుధాకర్‌రెడ్డి, గజెల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి

మంచిర్యాలక్రైం: తెలంగాణ ప్రభుత్వంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూధన్‌రావ్ ఆరోపించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి కృష్ణను ఆదివారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు జరుగుతున్న అన్యాయంపై టీఎస్‌పీఎస్సీలో జరిగిన లీకేజీ కుంభకోణంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ పాలనలో ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మలా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మున్నరాజ్ సిసోడియా, పెద్దపల్లి పురుషోత్తం, లింగన్నపేట విజయ్‌కుమార్, మల్లికార్జున్, సోమ ప్రదీప్ తదతరులు పాల్గొన్నారు.

నేడు వారసంతకు వేలం

తాండూర్: మండల కేంద్రంలోని ఐబీ బుధవారం వారసంతకు ఈ నెల 20వ తేదీ సోమవారం రోజున వేలం నిర్వహిస్తున్నట్లు తాండూర్ పంచాయతీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు రూ.10వేలు డిపాజిట్‌ను పంచాయతీ కార్యాలయంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

తాండూర్: జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జన చైతన్యయాత్ర ప్రారంభమవుతుండగా, తాండూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఆదివారం యాత్ర పోస్టర్లను సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.ఆశయ్య ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బస్సుయాత్రకు స్వాగతం పలికి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.30
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	40
బీరకాయ	100
వంకాయ	40
కాకరకాయ	60
బెండకాయ	80
అలసంద	60
దొండకాయ	60
సొరకాయ	20
ఆకుగోబి	30
పూగోబి	50
క్యారెట్	50
క్యాప్సికం	80
పాలకూర	30
తోటకూర	30
ములక్కాయ	100

- మంచిర్యాలఅగ్రికల్చర్



ప్రయాణికులకు పైసలెట్లా?

- బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ఏటీఎం సేవలు కరువు?
- ఏర్పాటుకు ముందుకు రాని బ్యాంకులు
- చొరవ చూపని రైల్వే అధికారులు



బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్

బెల్లంపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏటీఎం సౌకర్యం ఏళ్ల తరబడి కలగానే మిగిలిపోతోంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏటా రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు నోచుకుంటున్నా, ఏటీఎం ఏర్పాటు చేయించడంలో రైల్వే అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. అందుబాటులో ఏటీఎం లేక ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అత్యవసరంగా నగదు డ్రా చేసుకోవడానికి నానా ఇక్కట్లు పడుతున్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో మరిన్ని సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయించకపోయినా, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విశాలమైన రైల్వే ప్రాంగణం ఉన్నా..

జిల్లాలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. రెండో అతి పెద్ద రైల్వేస్టేషన్‌గా విరాజిల్లుతోంది. బెల్లంపల్లి చుట్టు పక్కల ఉన్న 8మండలాల ప్రజలకు రైల్వేస్టేషన్ ప్రయాణ సదుపాయం కల్పిస్తోంది. అంతగా ప్రాచుర్యం పొందిన రైల్వే స్టేషన్‌లో ఏటీఎం లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తుండగా, ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను గుర్తు చేస్తోంది. విశాలమైన రైల్వే ప్రాంగణం ఉన్నా సానుకూల నిర్ణయం తీసుకోవడంలో అటు రైల్వే అధికారులు, ఇటు ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకులు ముందుకురాకపోవడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది.

రోజుకు 20ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు..

ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన రైల్వే మార్గంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఉంది. రోజుకు 20కి పైగా రైళ్లు ఆగి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఎప్పుడు చూసినా రైల్వే స్టేషన్ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది.

నగదు డ్రా చేసుకోవడానికి .....

ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతున్నా, నగదుతో కూడా అవసరాలు ముడిపడి ఉంటున్నాయి. డబ్బు అవసరం ఉన్న ప్రయాణికులు ఏటీఎంల కోసం బజారుఏరియా, కాల్‌టెక్స్ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆటోలో ఏటీఎంకు వెళ్లి నగదు డ్రా చేసుకుని తిరిగి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో రైలు ప్రయాణికులు తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు. ప్రయాణికుల పాట్లను రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వేస్టేషన్ ఆవరణలో ఏటీఎం ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏటీఎం సేవలు కల్పించాలి



రైల్వేస్టేషన్ ఆవరణలో ఏటీఎం సేవలు కల్పించాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నాం. కానీ రైల్వే అధికారులు మాత్రం సానుకూలంగా స్పందించడం లేదు. డబ్బులు అత్యవసరమై డ్రా చేసుకోవడానికి ప్రయాణికులు పడుతున్న పాట్లను పట్టించుకోకపోవడంతో కాల్‌టెక్స్, బజారు ఏరియా ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఏటీఎం ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి వె ంటనే ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. – రాజలింగు, రైలు ప్రయాణికుడు, బెల్లంపల్లి

నిర్లక్ష్యం వీడాలి



రైల్వేలో ఇటీవలి కాలంలో ఎన్నో ఆధునీకతలు చోటు చేసుకున్నాయి. రైల్వేస్టేషన్లను ఆధునీకరించడంతో పాటు టిక్కెట్ల జారీ కోసం స్టేషన్‌లలో యంత్రాలను ఏర్పాటు చేశారు. ఏటీఎంను ప్రారంభించడానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ తీరు ఏమాత్రం మంచిది కాదు. ఇప్పటి వరకు అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని వీడి, వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించి బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ఏటీఎం సౌకర్యం కల్పించడానికి ముందుకురావాలి.

– రంగ ప్రశాంత్, సామాజిక కార్యకర్త, బెల్లంపల్లి

భగత్‌సింగ్ వర్ధంతిని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: బెల్లంపల్లిలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి కాగడాల ప్రదర్శనను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఎర్రమందారాలను స్మరించుకుంటూ ఈ నెల 23న బెల్లంపల్లిలో కాగడాల ప్రదర్శన, వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, దేవి పోచన్న, రేగుంట చంద్రశేఖర్, దాడా మహేందర్ రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో రాంనగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు యాదగిరి ఇటీవలే మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.1లక్ష , బోయపోతుల రాజన్న కాలుకు ఫ్రాక్చర్ కాగా ఆయన కుటుంబానికి రూ.11వేలు, మల్లేష్ కుటుంబానికి రూ.5వేలు, రమేష్ మేస్త్రీ కుటుంబానికి రూ.5వేలు, అరే కృష్ణ, ముద్దసాని కనకయ్య కుటుంబ సభ్యులకు రూ.3వేల చొప్పున భవన నిర్మాణ సంఘం నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మురళీమోహన్, ఉపాధ్యక్షుడు సూరయ్య, కోశాధికారి సత్యనారాయణ, సమన్వయకర్త అగ్గిరాములు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



లక్సెట్టిపేట: సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలోని రాళ్లపేటకు చెందిన అబీబ్ ప్లంబర్ పని చేస్తూ అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందాడు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితులను గమనించిన ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్, గౌరవ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అబీబ్ కుటుంబసభ్యులను పరామర్శించి వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అబీబ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవా, జావీద్ పాషా, మంచిర్యాల పట్టణ ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షులు పొట్టాల మల్లేష్, ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన మూడు నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యక్తులకు వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం

బెల్లంపల్లి: భారత్ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 20వ తేదీ సోమవారం బెల్లంపల్లిలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మధ్యాహ్నం 2గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరు కానున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు, బీఆర్‌ఎస్ మండల, గ్రామ, పట్టణ కమిటీల అధ్యక్షులు, సభ్యులు, రైతుబంధు సమితి సభ్యులు హాజరు కావాలని కోరారు.

విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: ఈ నెల 25, 26, 27తేదీల్లో మంచిర్యాలలో జరిగే ఏఐటీయూసీ 8వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'సుమన్ హయాంలోనే చెన్నూర్ అభివృద్ధి'

భీమారం: ప్రభుత్వ విప్ బాల్కసుమన్ హయాంలోనే చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. చెన్నూరులో ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన వివేక్ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా వివేక్ ఇక్కడి నిరుద్యోగులకు ఎలాంటి అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల్లో ఫ్యాక్టరీలు నెలకొల్పి, ఇక్కడి యువతకి మొండి చెయ్యి చూపాడని ఆరోపించారు. ప్రభుత్వ విప్ కేవలం చెన్నూర్ అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేయించి పనులు చేపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ పర్తిరెడ్డి మహేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- నేలరాలిన మామిడికాయలు.. తల్లడిల్లుతున్న అన్నదాతలు
- పరిహారం అందించాలని వేడుకుంటున్న రైతులు



నెన్నెల: చిత్తాపూర్‌లో నేలరాలిన మామిడి



దండేపల్లి: తాళ్లపేటలో నేలరాలిన మామిడికాయలు

నెన్నెల: మరో 20రోజుల్లో మామిడి కాయలు చేతికి అందుతాయని తద్వారా పత్తి, వరి పంటల్లో జరిగిన నష్టాన్ని పూడ్చుకుంటామని అనుకున్న మామిడి రైతుల ఆశలు శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఆవిరైపోయాయి. గాలివానతో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. అసలే అంతంత మాత్రంగా కాసిన మామిడి కాయలు నేలపాలు కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ధర లేక ఇంట్లో జాగ లేక బయట నిల్వ చేసిన పత్తి గడ్డలు తడిసి పత్తి రైతులకు మరింత నష్టం జరిగింది. జొప్పారం, నెన్నెల, నందులపల్లి గ్రామాల్లో మొక్కజొన్న నేలకొరిగింది. కూరగాయలకు స్వల్ప నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేమనపల్లి: మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో మిర్చి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. మండల కేంద్రంతో పాటు కేతన్‌పల్లి, ముల్కలపేట, కల్లంపేట, కొత్తపల్లి, గొర్లపల్లి, దస్నాపూర్ గ్రామాల్లో కోసిన మిర్చి పంట రాసులు కళ్లల్లోనే తడిసిపోయాయి. గాలులకు మొక్కజొన్న నేలకొరిగింది.అకాల వర్షంతో చామనపల్లి, బద్దంపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్ద వాగులోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఇటీవల నిర్మించుకున్న తాత్కాలిక రోడ్డుకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వాహనాలు దాటలేని పరిస్థితి నెలకొంది. చామనపల్లి, బొమ్మెనతో పాటు పక్కన ఉన్న నెన్నెల, కొత్తపల్లి మండలాలకు రాకపోకలు స్తంభించాయి. మంగెనపల్లి నుంచి నాగారాం వరకు అటవీ మార్గంలో ఉన్న రోడ్డు బురదమయంగా మారింది.

భీమారం: మండలంలో భారీ వర్షం కారణంగా మండలవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచి అంధకారమైంది. రాత్రి వర్షం కారణంగా నిలిచిన విద్యుత్ సరఫరా ఆదివారం మధ్యాహ్నం పునరుద్ధరించారు. మామిడి పంట కొంత వరకు నష్టం వాటిల్లింది.జ

మందమర్రిరూరల్: పట్టణంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వాడలన్ని చిత్తడిగా మారాయి. కాలువల్లో చెత్త, పూడిక నిండి ఉండడంతో వర్షపు నీరు కాలువల గుండా వెళ్లకుండా రోడ్డుపైనే నిలిచి బురదమయంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరి ఇబ్బంది పడ్డారు.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట క్లస్టర్ పరిధిలోని తాళ్లపేట, నాగసముద్రం, మాకులపేట శివారుల్లో వడగండ్ల వానతో 80ఎకరాల్లో మొక్కజొన్న, 35ఎకరాల్లో వరిపైరు దెబ్బతినగా, దండేపల్లి క్లస్టర్ పరిధిలో దండేపల్లిలో 25ఎకరాల్లో వరి, నర్సాపూర్ శివారులో 6ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా వేశారు. వీటితో పాటు గూడెం శివారులో అర ఎకరంలో టమాట, రెబ్బనపల్లి శివారులో ఎకరంలో దోసతోటకు నష్టం వాటిల్లింది.

పోచమ్మా.. సల్లంగా చూడమ్మా..!



మంచిర్యాలఅర్బన్: బోనాలతో ఊరేగింపు



భీమిని: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఊరువాడ, పిల్లాపాపలను సల్లంగా చూడాలని గ్రామ దేవతైన పోచమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు సప్పుళ్లతో ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. తల్లీ.. మమ్మల్ని సల్లంగా చూడు అంటూ వేడుకున్నారు..



మందమర్రిరూరల్: పోచమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు



కాసిపేట: పెద్దనపల్లిలో పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఒడ్డెర కాలనీలో ఆదివారం పోచమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి నుంచి ఒడ్డెరకాలనీ పోచమ్మ ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పల్లపు తిరుపతి, కమిటీ సభ్యులు గోడిశెల దశరథం, రాజమౌళి, పల్లపు రాజు, ఎలుకరాజు, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలో భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. డప్పుసప్పుళ్లతో వెళ్లి బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ సోమగూడం పాతబస్తీ, కాసిపేట, సోమగూడం భరత్‌కాలనీ గ్రామాల్లో పోచమ్మ బోనాలు నిర్వహించారు. డప్పుసప్పుళ్లతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్‌లు వేముల కృష్ణ, ప్రమీల గౌడ్, గ్రామపెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గుండాలలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారికి నైవేద్యం వండి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలు బలిచ్చి చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

వంతెన పక్కనే వ్యర్థాలు



నెన్నెల కుమ్మరివాగు బ్రిడ్జి వద్ద కోళ్ల వ్యర్థాలు

నెన్నెల: మండల కేంద్రంలోని చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను కుమ్మరివాగు బ్రిడ్జికి ఇరువైపులా నిల్వ ఉన్న నీటిలో వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ ప్రదేశానికి రాగానే ఒక్కసారిగా వచ్చే కంపు వాసనను భరించలేక ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రానికి చేరుకోవాలంటే, బెల్లంపల్లికి వెళ్లాలంటే అధికారులు, ప్రజలు ఈ దారిగుండా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆ వ్యర్థాలను తినడానికి వచ్చిన కుక్కలు కొట్లాడుకుంటూ రోడ్ల పైకి వస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు అధికారులకు తెలిపినా, ముక్కు, కళ్లు మూసుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారే తప్పా పట్టించుకోవడం లేదు. చికెన్ దుకాణ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి దుకాణ యజమానులపై చర్యలు తీసుకొని వ్యర్థాలను కుమ్మరివాగులో, రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూడాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సత్యసాయినగర్ కాలనీకి చెందిన విద్యార్థులకు న్యూ లైఫ్ ప్రేయర్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు రవిజోసెఫ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రిని అందజేశారు.